క్లుప్తంగా

వణుకూరులో వృద్ధులకు అన్నదానం

పెనమలూరు: వణుకూరు గ్రామంలో వృద్ధులకు బుధవారం దాతలు అన్నదానం చేశారు. వణుకూరు ఆదరణ వృద్ధుల ఆశ్రమంలో పడమట నాగభూషణం, నాంచారమ్మ దంపతులు పడమట వీరమ్మ జ్ఞాపకార్థం 40 మంది నిరుపేద వృద్ధులకు అన్నదానం చేశారు.

వలంటీర్ల ఎంపికకు నేడు ఇంటర్వ్యూలు

పెనమలూరు: వలంటీర్ల నియామకానికి గురువారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. పెనమలూరు మండలం తాడిగడప మున్సిపాలిటీలో పలు ప్రాంతాల్లో వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెనమలూరు మండలంలో మూడు గ్రామాల్లో నాలుగు పోస్టులు ఉండగా ఏడు దరఖాస్తులు అభ్యర్థుల నుంచి అందాయి. తాడిగడప మున్సిపాలిటీలో మొత్తం 28 ఖాళీలు ఉన్నాయి. కానూరులో ఐదు, పోరంకిలో ఏడు, తాడిగడపలో నాలుగు, యనమలకుదురులో 12 ఖాళీలు ఉన్నాయి. వీటికి గాను 31 దరఖాస్తులు అందాయి. పెనమలూరు మండలానికి చెందిన అభ్యర్థులకు మండల పరిషత్ కార్యాలయంలో, తాడిగడప మున్సిపాలిటీలో అభ్యర్థులకు పోరంకి మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీఓ సునితా శర్మ తెలిపారు.

మారేడుమాకలో అగ్నిప్రమాదం

కంకిపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి రేకుల షెడ్డు దగ్ధమైన సంఘటన మండలంలోని మారేడుమాక గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం...మారేడుమాక గ్రామానికి చెందిన గుంటకాని దివ్య, తన ఇద్దరు చిన్న పిల్లలతో కలసి చుట్టూ దడులు అల్లించిన రేకుల షెడ్డులో నివాసం ఉంటోంది. తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి షెడ్డు దగ్ధమైంది. ప్రమాదాన్ని గుర్తించిన దివ్య, తన పిల్లలతో సహా ఆరుబయటకు పరుగు పెట్టింది. స్థానికులు మంటలను ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. షెడ్డుకు ఉన్న కలప, చుట్టూ ఉన్న దడులు పూర్తిగా కాలిపోయాయి. లోపల ఉన్న సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైంది. రూ.50 వేలు ఆస్తి నష్టం వాటిల్లింది.

దివ్యాంగులకు వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి దివ్యాంగులకు విద్య, వసతి సదుపాయాలను కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని విశ్రాంత ఎంఈవో, మానవత కన్వీనర్ ఘంటా సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆదిత్య బధిరుల పాఠశాల, ఆశాజ్యోతి దివ్యాంగుల సొసైటీలకు బుధవారం ఆయన రూ.6 వేలు విరాళం అందజేశారు. ఆయన మనవళ్లు శ్రీహన్, శ్రీహాస్‌ల జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ మొత్తాన్ని అందించారు. బధిరుల పాఠశాల కరస్పాండెంట్ ఆకుల వెంకట రమణ, ఆశాజ్యోతి వ్యవస్థాపకుడు మరీదు వెంకటస్వామి, మానవత సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండుగగా జరిగింది. అధికసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు ఆలయానికి విచ్చేశారు. ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వర రావు (బాబు), మాజీ సర్పంచ్ కాకాని అరుణ పాల్గొన్నారు.

వైభవంగా షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ఉంగుటూరు: ఇందుపల్లిలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున విఘ్నేశ్వరస్వామి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి, 100 లీటర్ల క్షీరాభిషేకం చేశారు. ధునిపూజ, సమస్రనామ పూజ, భజన, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం బాజాభజంత్రీలతో గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉయ్యూరు మురళి, కార్యదర్శి రామచంద్రరావు పర్యవేక్షణలో అన్నదానం చేశారు.

ఎట్టకేలకు 2కే రహదారి నిర్మాణం

- రూ.1.60 కోట్లతో బీటీ రోడ్డు
- దశాబ్దకాలం తరువాత మోక్షం
- ఎమ్మెల్యే పార్థసారథి చొరవతోనే సాధ్యం



నిర్మాణం పూర్తయిన కానూరు 2కే రోడ్డు

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని కానూరులో ఎట్టకేలకు 2కే (నవతా రోడ్డు) నిర్మాణం చేశారు. దాదాపు దశాబ్ద కాలం తరువాత ప్రభుత్వ ఆదేశాలతో ఈ రోడ్డు పనులు రూ.1.60 కోట్లతో చేపట్టి పూర్తి చేశారు. కానూరు గ్రామం నుంచి ఆటోనగర్‌కు వెళ్లటానికి 2కే రోడ్డు (నవతా రోడ్డు) ఉంది. ఈ రోడ్డు కానూరు ప్రధాన రహదారి నుంచి బల్లెంవారి వీధి ఆంజనేయ స్వామి గుడివరకు ఉండి లింకు రోడ్డుగా ఉపయోగపడుతుంది. ఆటోనగర్‌కు వెళ్లే కార్మికులతో పాటు, ఆటోనగర్ నుంచి కానూరు వందడుగుల రోడ్డుకు వెళ్లే వాహనాలు ఈ రోడ్డు మీదగానే వెళతాయి.పైగా ఈ ప్రాంతంలో ఉన్న చిన్న, పెద్ద పరిశ్రమలకు సంబంధించిన ముడిసరుకుల రవాణా కూడా ఈ రోడ్డు మీదుగానే జరుగుతాయి.

గత పాలనలో పూర్తి నిర్లక్ష్యం

నిత్యం ట్రాఫిక్‌తో ఉండే నవతా రోడ్డు నిర్మాణం విషయంలో గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. రోడ్డు పూర్తిగా గుంతలుగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చినుకుపడితే రోడ్డుపై ప్రయాణం నరకయాతనగా ఉండేది. రోడ్డు అధ్వానంగా ఉండటంతో తరచుగా ప్రమాదాలు జరిగేవి. విపరీతమైన ట్రాఫిక్ ఉన్నా గత పాలకులు ఈ రోడ్డు నిర్మాణాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. దాదాపు పది సంవత్సరాల తరువాత ఈ రోడ్డుకు మోక్షం కలిగింది.

1500 మీటర్ల పొడవున బీటీ రోడ్డు

దారుణంగా మారిన 2కే(నవతా) రోడ్డును నిర్మాణం చేయాలని ఆటోనగర్ వాసులు, కార్మికులు, గ్రామస్తులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని కోరారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి రూ.1.60 కోట్ల నిధులు మునిసిపాలిటీ నుంచి మంజూరు చేయించారు. వెంటనే శంకుస్థాపన చేసి పనులు చేయాలని ఆదేశించారు. ఏడు మీటర్ల వెడల్పు, 1500 మీటర్ల పొడవున బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి సకాలంలో పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేయటంతో ఈ రోడ్డు ప్రస్తుతం స్థానికులకు సౌకర్యవంతంగా మారింది.

అదనంగా మరో రూ.40 లక్షలు మంజూరు

కానూరు నవతా రోడ్డు మిగిలిన కొద్ది భాగం తిరుపతమ్మ గుడివరకు నిర్మాణం చేయటానికి మరో రూ.40 లక్షలు నిధులు అదనంగా మంజూరు చేశారు. ఈ నిధులతో దాదాపు 600 మీటర్ల మేర మిగిలిన రోడ్డును నిర్మాణం చేస్తారు. ఈ పనులు కూడా వెంటనే చేపట్టి పూర్తి చేయనున్నారు. ఇందుకుగాను నిర్మాణ సన్నాహాలు చేపట్టారు. ఈ పనులు కూడా పూర్తి చేస్తే కానూరు వాసుల చిరకాల సమస్య ఎట్టకేలకు పరిష్కారమవుతుంది.

20లోగా గృహ సారథులను నియమించాలి

గన్నవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింత సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గృహ సారథుల నియామక ప్రక్రియను ఈ నెల 20వ తేదీ లోపు పూర్తిచేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు, కన్వీనర్లు పిలుపునిచ్చారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో బుధవారం పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజలు ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ పథకాల అమలులో మరింత పారదర్శకత, వేగవంతం చేసేందుకు ప్రతి యాభై ఇళ్లకు ఒక మహిళ, ఒక పురుషుడు చొప్పున ఇరువురు గృహ సారథులను నియమించాలని చెప్పారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోపు గృహ సారథుల నియామకాలను పూర్తిచేసి జాబితాలను అందజేయాలని కోరారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాసరనేని గోపాలరావు, మండల అధ్యక్ష, కన్వీనర్లు వింత శంకర్‌రెడ్డి, అవిర్నేని శేషగిరిరావు, పడమట సురేష్, కైలే శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి అందరి లక్ష్యం కావాలి

ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి, పక్కన బాకీ బాబు, ఏఓ ఉదయ్‌భాస్కర్

కంకిపాడు: మండల సమగ్రాభివృద్ధి అందరి లక్ష్యం కావాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. శాఖల వారీ సమీక్ష నిర్వహించి అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని కోరారు. పెండింగ్ పనులపై దృష్టి సారించి మౌలిక వసతుల కల్పన పనులను చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి వసతుల కల్పనకు మండల పరిషత్ నిధులతో డబ్బా పంపుల మరమ్మతులకు సామగ్రి సిద్ధంగా ఉంచామని, నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులతో మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నామన్నారు. మండల ప్రగతికి అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించటంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతుందన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించే పరిస్థితి లేకుండా పోతుందని, ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. అధికారులు సక్రమంగా సమావేశాలకు హాజరుకావటం లేదని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. మారేడుమాక సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్ మాట్లాడుతూ ఏలూరు రోడ్డు మీదుగా విజయవాడ నుంచి తెన్నేరు వచ్చే బస్సు సర్వీసును మారేడుమాక వరకూ పొడిగించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ టీవీ సతీష్, మండల పరిషత్ ఏఓ ఉదయ్‌భాస్కర్, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆపదమిత్ర శిక్షణ తరగతులకు విద్యార్థుల ఎంపిక



సదస్సులో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలోని 24 మంది విద్యార్థులు ఆపదమిత్ర శిక్షణ తరగతులకు ఎంపికయ్యారని నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, రాష్ట్ర ప్రకృతి విపత్తుల కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 30 వరకు గుణదలలోని సామాజిక సేవా కేంద్రంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో రాష్ట్ర ప్రకృతి విపత్తుల సంఘం విద్యార్థులకు ఆపదమిత్ర ప్రాముఖ్యత, ఇతరత్రా అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రం, గుర్తింపు కార్డు అందజేస్తారని వివరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో మామిడిలో అధిక దిగుబడులు

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం మామిడి రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన సదస్సు జరిగింది. నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆర్.రాధారాణి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ మామిడి తోటలలో పూత రాని చెట్లకు స్వల్ప నీటి తడులు ఇచ్చి పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు, జింక్ 2 గ్రాములు, బోరాన్ 2గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ఈ విధంగా చేస్తే పూత బయటకు వస్తుందన్నారు. పూత దశలో ఉన్న చెట్లకు తేనె మంచు, తామర పురుగు ఉధృతి గమనించాలని, పురుగు సమస్య ఉంటే పూత కాడకు 3 లేదా 4 పురుగులు ఉంటే వేప నూనె 1500 పీపీఎం 3 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పక్షి కన్ను తెగులు ఉంటే కార్బండిజం ఒక గ్రాము, మాంకోజెట్ 2.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు పురుగు మందులను ఇష్టానుసారంగా వాడవద్దని చెప్పారు. ఎప్పటికప్పుడు ఎండు పుల్లలను చెట్ల నుంచి తీసివేయాలన్నారు. కలుపు తీయటం, సూక్ష్మ పోషకాలు అందించటం చేసుకోవాలన్నారు. రసాయన మందులు వాడకం సాధ్యమైనంత మేర తగ్గించాలని చెప్పారు. సర్పంచ్ పులపాక బాబూరావు, ఉద్యాన అధికారి ఇ.హరిచంద్, హెచ్ఏ దీక్ష, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన గ్రామోత్సవం



వైభవంగా జరుగుతున్న అమ్మవారి గ్రామోత్సవం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం ప్రసాదంపాడులో కొనసాగుతోంది. గత ఐదు రోజులుగా రామవరప్పాడు, ప్రసాదంపాడు పురవీధుల్లో జరుగుతున్న గ్రామోత్సవం గురువారం తెల్లవారుజామున పూర్తవుతుంది. పలు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ఉత్సవ వాహనాన్ని అనుసరిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. పలువురు మహిళలు పసుపు నీళ్లు వాహనం ఎదుట పోసి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి మాట్లాడుతూ గత ఐదు రోజుల నుంచి అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతోందన్నారు. అనుకున్న సమయానికంటే గ్రామోత్సవానికి సమయం ఎక్కువ సమయం పడుతుండటంతో తెప్పోత్సవం, పూలంకి సేవ అర్ధరాత్రి దాటిన తర్వాత గురువారం తెల్లవారుజామున జరుగుతుందని తెలిపారు. ఉత్సవాల్లో అమ్మవార్లకు రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని ఈనెల 19న లెక్కిస్తామన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా 20న ఆలయంలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

పౌరాణిక పాత్రలకు ప్రాణం పోసిన ఎన్టీఆర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సినీ ప్రపంచంలో విభిన్న పాత్రలతోపాటు పౌరాణిక ప్రాణం పోసిన మహానటుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు బుధవారం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సినీ రంగంలో వివిధ పాత్రల ద్వారా ప్రేక్షకులను అలరించి నటసార్వభౌమ, నటరత్న పేరుపొందిన ఎన్టీఆర్ చలనచిత్ర రంగానికి ఎనలేని సేవలందించారన్నారు. విజయవాడ మున్సిపల్ హైస్కూల్లో పాఠశాల విద్యను అభ్యసించి ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల, గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారన్నారు. మద్రాస్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి, సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగంలో చేరారన్నారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి, 1949వ సంవత్సరంలో పల్లెటూరు చిత్రం ద్వారా సినీ రంగంలో అడుగు పెట్టారన్నారు. ఎన్టీఆర్ క్రమశిక్షణ, సమయ పాలనను కచ్చితంగా పాటించేవారన్నారు. 1983లో రాజకీయ రంగ ప్రవేశం చేసి ముఖ్యమంత్రి అయ్యారన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన అన్ని రకాల పుస్తకాలు ఠాగూర్ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను జమల పూర్ణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే యువతీ, యువకులకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రంథాలయంలో పోటీపరీక్షల కోసం స్టడీల్యాబ్, ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్, ఆరు నుంచి పదో తరగతి వరకు వివిధ సబ్జెక్టుల పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. పుస్తక పఠనంతో మేధో వికాసం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, గ్రంథాలయాధికారి రమాదేవి, డి.రమేష్, కె.రాంబాబు, జె.శంకర్, గోపాలరావు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ సత్యన్నారాయణ

గన్నవరం రూరల్: క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని సీఐ సత్యన్నారాయణ అన్నారు. మండలంలోని సూరంపల్లి క్రీడా మైదానంలో గడచిన 15 రోజులుగా సూరంపల్లి యంగ్‌బాయ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ యువతను సరైన మార్గంలో నడిపించేవి క్రీడలేనని చెప్పారు. చెడు మార్గం వైపు వెళ్లకుండా సన్మార్గంలో నడిచేందుకు క్రీడలు ఉపయోగపడతాయన్నారు. నాయకత్వ లక్షణాలు, లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడే క్రీడలను నిర్వహించిన యంగ్ బాయ్స్‌ను అభినందించారు. ఎంపీటీసీ సభ్యులు కొండా సీతారామయ్య, మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి దేవరపల్లి మధుబాబు జ్ఞాపకార్థం కోటేశ్వరరావు రూ.20వేలు అందించగా ఆ చెక్కును మొదటి స్థానం సాధించిన ముదిరాజు పాలెం సీసీ జట్టుకు, రెండవ బహుమతి రూ.10వేలు యంగ్ బాయ్స్‌కు సీఐ అందజేశారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి



ఎన్టీఆర్, వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గన్నవరం: స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో పాటు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్, వైఎస్సార్ చేసిన కృషిని స్మరించుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పడమట సురేష్, నాయకులు మేచినేని బాబు, అవిర్నేని శేషగిరిరావు, కలాం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక పాలశీతల కేంద్రం ప్రాంగణం, వీరవల్లి, రంగన్నగూడెంలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, వేములపల్లి శ్రీనివాసరావు, చెన్ను బోయిన శివయ్య, గుండపనేని ఉమావర ప్రసాద్, ఆళ్ల గోపాలకృష్ణారావు, లంక సురేంద్ర మోహన బెనర్జీ పాల్గొన్నారు.

పెనమలూరులో ఎన్టీఆర్ వర్ధంతి

పెనమలూరు: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి బుధవారం పెనమలూరు పరిధిలో పలు గ్రామాల్లో జరిగింది. పోరంకిలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బోడెప్రసాద్, నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్‌బాబు, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, మారుపూడి ధన కోటేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

నున్నలో అక్రమ కట్టడాలు కూల్చివేత



నున్న గ్రామంలో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

నున్న(విజయవాడరూరల్): సీఆర్‌డీఏ అధికారులు బుధవారం నున్న గ్రామంలో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. నున్న మ్యాంగోమార్కెట్ ఎదురుగా హైటెన్షన్ వైర్ల కింది భాగంలో నిర్మాణంలో ఉన్న కట్టడాలను తొలగించారు. అనంతరం నున్న గ్రామంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన సర్వే నంబర్లు 760, 413, 329, 143 లేఅవుట్లను ధ్వంసం చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వం నుంచి అధికారపూర్వకంగా అన్ని అనుమతులు తీసుకున్న పిమ్మట భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. లేఅవుట్లను కూడా అన్ని అనుమతులు తీసుకున్న పిమ్మట వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్లాట్లు కొనుగోలు చేసే వారు కూడా ముందుగా అన్ని అనుమతులను పరిశీలించిన పిమ్మట కొనుగోలు చేయాలని సూచించారు. అక్రమ నిర్మాణాలను, అక్రమ లేఅవుట్లను సహించేది లేదన్నారు. కార్యక్రమాల్లో జూనియర్ ప్లానింగ్ అధికారి ప్రభాకరరావు, ఏడీఎం మధుసూదనరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి



ఉంగుటూరులో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు

ఉంగుటూరు: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు ప్రణాళికతో పని చేయాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల, గ్రామ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి సోమవారం స్పందన అనంతరం సమీక్ష నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో రక్త హీనత కలిగిన మహిళలు, పిల్లలను గుర్తించి పోషకాహారం, రోగ నిరోధకత అందే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యారాధన భారతీయ సంస్కృతిలో భాగం



సూర్యయంత్రం

విజయవాడ కల్చరల్: సూర్యారాధన భారతీయ సంస్కృతిలో భాగమని వేద పండితులు దెందుకూరి సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. శృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలో భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సూర్యనారాయణస్వామికి అర్చన, మహాసౌరం, అరుణం సౌరాక్షరి మంత్ర జపం కార్యక్రమం బుధవారం భక్తిగా సాగాయి. ఆయన మాట్లాడుతూ వేద స్వరూపుడు సూర్యభగవానుడని ప్రత్యక్ష దైవంగా భావించవచ్చన్నారు. సూర్యారాధన వల్ల పంచమహాపాతకులను విముక్తి పొందవచ్చని మనిషిలోని మానసిక రుగ్మతలను హరించవచ్చని తెలిపారు. భారతీయ పురాణాలలో సూర్యుడికి ప్రత్యేక స్థానముందన్నారు. ధర్మాధకారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం, సర్వమానవాళి శ్రేయస్సుకు జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో 73 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాగ క్రతువులను భక్తులు స్వయంగా వీక్షించవచ్చన్నారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన రుత్వికులు సూర్యారాధనలో పాల్గొన్నారు. సూర్య యంత్రానికి పూజలు నిర్వహించారు.